

## భూముల రీ సర్వే కచ్చితంగా జరగాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

- రెవెన్యూ, సర్వే శాఖల అధికారులకు శిక్షణ
- 18 రోవర్ యంత్రాలతో రీ సర్వే వేగవంతం

15 లో


# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

రాజన్న సిరిసిల్ల , జగిత్యాల, పెద్దపల్లి

శుక్రవారం 09 అక్టోబర్ 2026






## భక్తులకు ఇబ్బందులు లేకుండా పుష్కర ఏర్పాట్లు చేయాలి

- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్
- బీర్ పూర్ మండలంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన
- రూ.9.36 లక్షల విలువైన సింఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

4లో

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- 12వందల లీటర్ల గుడుంబా బెల్లం పానకం
- 20 లీటర్ల నాటు సారాయి ధ్వంసం

8లో



## వైద్యశాఖ ఉద్యోగాలకు భారీ పోటీ

- 40 పోస్టులకు 2,454 దరఖాస్తులు
- స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు వందల సంఖ్యలో పోటీ
- గైనకాలజీ డాక్టర్ పోస్టులకు నిల్..!




వివరాలు 3లో..



## పంట చేతికొచ్చే వేళ

# గుండెకోత

- ఎండల తీవ్రతకు అడుగంటిన బావులు, ఇంకిపోయిన బోర్లు
- చివరి తడికి నీళ్లు లేక అల్లాడుతున్న జగిత్యాల జిల్లా రైతాంగం
- ఎస్సారెస్పీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతుల వేడుకోలు

మిగతా 2 లో

ఆరుగాలం కష్టపడి పెంచిన పంట చేతికొచ్చే ఆఖరి ఘడియల్లో జగిత్యాల జిల్లా రైతులకు నీటి తిప్పలు మొదలయ్యాయి. ఖరీఫ్ (వానకాలం) సీజన్ ప్రారంభం నుండి అడపాదడపా కురిసిన వర్షాలతో ఎట్టకేలకు పంటను చివరి దశకు తీసుకొచ్చిన రైతులకు, గత వారంగా మారిన వాతావరణం మింగుడుపడటం లేదు. భానుడి భగభగలకు బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు హఠాత్తుగా పడిపోవడంతో పైర్లు కళ్లముందే ఎండిపోతున్నాయి.

## ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి

### హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి..

- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలి
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలి
- తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ



6లో

# పంట చేతికొచ్చే వేళ

# గుండెకోత

## ఎండిపోతున్న 'వరి'!





ప్రభుత్వ విప్ కు రైతుల వినతిపత్రం

- ఎండల తీవ్రతకు అడుగంటిన బావులు, ఇంకిపోయిన బోర్లు
- చివరి తడికి నీళ్లు లేక అల్లాడుతున్న జగిత్యాల జిల్లా రైతాంగం
- ఎస్సారెస్పీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతుల వేడుకోలు



**జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్8(ప్రజాజ్యోతి ):** ఆరుగాలం కష్టపడి పెంచిన పంట చేతికొచ్చే ఆఖరి ఘడియల్లో జగిత్యాల జిల్లా రైతులకు నీటి తిప్పలు మొదలయ్యాయి. ఖరీఫ్ (వానకాలం) సీజన్ ప్రారంభం నుండి అడపాదడపా కురిసిన వర్షాలతో ఎట్టకేలకు పంటను చివరి దశకు తీసుకొచ్చిన రైతులకు, గత వారంగా మారిన వాతావరణం మింగుడుపడటం లేదు. భానుడి భగభగలకు బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు హఠాత్తుగా పడిపోవడంతో పైర్లు కళ్లముందే ఎండిపోతున్నాయి. ఇప్పుడు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా ఆఖరి తడికి నీటిని విడుదల చేయకపోతే ఎకరాకు వేల రూపాయల పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఈ వానకాలం సీజన్‌లో దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. కానీజిల్లాలో సగటు వర్షపాతం నమోదు కాలేదు. గడిచిన 10 రోజులుగా ఊహించని విధంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో భూమి త్వరగా ఎండిపోతోంది. దీనితో చిరుపొట్ట దశలో వరి ఎండిపోతుంది, జిల్లాలో ముఖ్యంగా మేడిపల్లి, జగిత్యాల రూరల్, మాల్యాల మండలాల్లో నీటి సమ-స్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లోని వేలాది ఎకరాల వరి పైరు ప్రస్తుతం గింజ పాలుపోసుకునే దశ మరియు పొట్ట దశలో ఉంది.

### పొట్ట దశలో పొలాలు... తడి లేకపోతే తీరని లోటు!

వరి పంటకు ఈ ఆఖరి 15 నుండి 20 రోజులు అత్యంత కీలకమైనవి. పంట గింజ గట్టిపడే సమయంలో నీటి ఎద్దడి ఏర్పడితే గింజ పొల్లుపోవడం, వెన్ను విరిగిపోవడం జరుగుతుంది. ఇప్పటికే మేడిపల్లి, మాల్యాల, జగిత్యాల రూరల్ పరిసర ప్రాంతాల్లో ఎస్సారెస్పీ కాలువను నమ్ముకుని రైతులు మోటార్లు అమర్చుకున్నారు. కాలువలోకి నీటిని వదిలితే, ఈ మోటార్ల ద్వారా నీటిని తోడుకొని పంటను కాపాడుకుంటామని రైతులు వాపోతున్నారు. పంట చేతికి వస్తేనే తమ అప్పులు తీరుతాయని, కుటుంబాలు గడుస్తాయని రైతులు కంటనీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం మరియు నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే సమీక్షించి, ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా చివరి తడికి నీటిని విడుదల చేసి, జగిత్యాల జిల్లా రైతాంగాన్ని ఆర్థికంగా నిలువునా మునిగిపోకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు.

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని కలిసిన తాటిపెల్లి రైతులు

ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా ఆఖరి తడికి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను, జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామ రైతులు కలిసి వినతిపత్రాన్ని అందచేశారు, స్వీకరించిన అనంతరం నీటిపారుదల (ఇరిగేషన్) శాఖ ఉన్నతాధికారులను సంప్రదించి, నీటిని విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు.

### ఎస్సారెస్పీ నీటిపైనే ఆశలు

మేడిపల్లి, మాల్యాల, జగిత్యాల రూరల్ మండలాల్లోని అనేక గ్రామాల రైతులు ఎస్సారె-స్పీ కాకతీయ కాలువ నీటిపై ఆధారపడి సాగు చేస్తున్నారు. కాలువలో నీరు అందుబాటులోకి వస్తే ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న మోటార్ల ద్వారా నీటిని పొలాలకు తరలించి చివరి తడిని అందించుకోవచ్చని రైతులు చెబుతున్నారు.

ప్రస్తుతం బోర్లు, బావుల్లో నీరు తగ్గిపోవడంతో ఎస్సారెస్పీ కాలువే తమకు ప్రధాన ఆధారమని రైతులు పేర్కొంటున్నారు. కాలువకు నీటిని విడుదల చేయడంలో ఆలస్యం జరిగితే పంట దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొస్తేనే అప్పులు తీర్చగలమని, కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులు, వ్యవసాయ పెట్టుబడులు తదితర అవసరాలను తీర్చుకోగలమని చెబుతున్నారు.

### పెట్టుబడులన్నీ పంటపైనే..

వరి సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కులు, నాట్లు, కలుపు నివారణ, కూలీల ఖర్చులు ఇలా ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. ఇప్పుడు పంట చివరి దశలో నీటి సమస్య ఏర్పడటంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఇప్పటివరకు పంటను కాపాడుకోవడానికి అప్పులు చేసి మరీ నీరు పెట్టాం. ఇప్పుడు బోర్లు, బావుల్లో నీరు తగ్గిపోయింది. చివరి తడి అందితే పంటను కోత వరకు తీసుకెళ్లవచ్చు. లేదంటే ఇంతకాలం చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి వృథా అవుతుంది" అని రైతులు వాపోతున్నారు.



### కళ్లముందే పైరు ఎండిపోతుంటే గుండె తర్రుక్కుపోతోంది..

ఇప్పటివరకు ఎలాగోలా అప్పులు చేసి పంటను కాపాడుకుంటూ వచ్చాం. చివరి తడి అందితే మరో పది రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయి. ఈ సమయంలో బోర్లు పోయడం లేదు, బావులు అడుగంటాయి. ఎస్సారెస్పీ నీళ్లు ఇస్తేనే మా బతుకులు నిలుస్తాయి. అధికారులు ,ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలి.

--- జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి రైతులు.



## టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో ఎలిగేడు మండలానికి అరుదైన గుర్తింపు

**ఎలిగేడు, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల పరిధిలోని ఐదు గ్రామాలు టీబీ రహిత గ్రామాలుగా ఎంపికై అరుదైన గుర్తింపు సాధించాయి. మండలంలోని నర్సాపూర్, ర్యాకల్ దేవ్ పల్లి, లోకపేట, రాములపల్లి, నారాయణపల్లి గ్రామ ప్రజాప్రతినిధులకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారి పవిత్ర ప్రశంసా పత్రాలను అందజేశారు. క్షయ వ్యాధి నివారణకు వైద్యాధికారులు, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి బాధితులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడం వల్లనే ఈ గుర్తింపు దక్కిందని అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిస్సి క్రిస్టియానా, స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌కు కృత్రిమ కాలు కోసం ఆర్థిక సహాయం

**గాయత్రి విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ చేయూత**

**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** అనారోగ్యంతో కుడికాలు కోల్పోయిన ఆటో డ్రైవర్‌కు కృత్రిమ కాలు ఏర్పాటుకు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పర్సనలైజ్డ్ సర్వీస్ డే సందర్భంగా గురువారం నిర్వహించిన సేవా కార్యక్రమంలో శాంతినగర్‌కు చెందిన అరికెల్ల రాములుకు గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్, లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ చార్టర్డ్ ప్రెసిడెంట్ అల్లెంకి శ్రీనివాస్ ఈ మొత్తాన్ని అందజేశారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాములు అనారోగ్య కారణంగా కుడికాలును మోకాలి కింది భాగం వరకు కోల్పోయారు. రోజువారీ కార్యకలాపాలు, ఉపాధి కొనసాగించేందుకు కృత్రిమ కాలు అవసరం కావడంతో క్లబ్‌ను ఆశ్రయించారు. స్పందించిన శ్రీనివాస్ తన వంతు సహాయంగా రూ.5 వేలు అందించారు. అవసరంలో ఉన్న వారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఎలైట్ సభ్యులు పాల్గొన్నారు.




# వైద్యశాఖ ఉద్యోగాలకు భారీ పోటీ

- 40 పోస్టులకు 2,454 దరఖాస్తులు
- స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు వందల సంఖ్యలో పోటీ
- గైనకాలజీ డాక్టర్ పోస్టులకు నిల్..!




**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** పెద్దపల్లి జిల్లాలో వైద్యశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి భారీ స్పందన లభించింది. ఎనిమిది విభాగాల్లోని 40 పోస్టులకు ఏకంగా 2,454 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు భారీగా దరఖాస్తులు రావడంతో పోటీ తీవ్రంగా నెలకొంది. స్టాఫ్‌నర్స్ 15 పోస్టులకు 920 మంది, ఏఎన్ఎం 3 పోస్టులకు 492 మంది, ఎంఎల్‌హెచ్‌పీ 8 పోస్టులకు 416 మంది, ల్యాబ్ టెక్నీషియన్ 8 పోస్టులకు 416 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్‌టీఎల్ఎస్ రెండు పోస్టులకు 55 మంది, ఫార్మసిస్ట్ ఒక పోస్టుకు 149 మంది, పాథాలజిస్ట్ ఒక పోస్టుకు ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు రెండు గైనకాలజీ డాక్టర్ పోస్టులకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ పోస్టులకు ఆయా విభాగాలను బట్టి విద్యార్హతలు, సంబంధిత వృత్తిపరమైన అర్హతలు, రిజిస్ట్రేషన్ తదితర నిబంధనలు వర్తిస్తాయి. స్టాఫ్‌నర్స్ పోస్టులకు నర్సింగ్ అర్హత, ఏఎన్ఎం పోస్టులకు సంబంధిత ఏఎన్ఎం శిక్షణ, ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు సంబంధిత వైద్య విద్యార్హత, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధిత ప్రయోగశాల సాంకేతిక విద్యార్హత అవసరంగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. మిగిలిన పోస్టులకు కూడా ఆయా విభాగాలకు సంబంధించిన ప్రత్యేక విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ నిబంధనలు వర్తిస్తాయి. ఖాళీల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర తెలిపారు. దరఖాస్తుల పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేసి, అనంతరం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# డిజిటల్ సాంకేతికతతో బోధన మరింత ప్రభావవంతం

**ఖాన్ అకాడమీ వనరులను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** డిజిటల్ సాంకేతికతను తరగతి గది బోధనతో అనుసంధానం చేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలోని అంశాలను ఉపాధ్యాయులు క్షుణ్ణంగా అవగాహన చేసుకొని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఖాన్ అకాడమీ అందిస్తున్న డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల్లో ముఖ్యంగా గణిత నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి నిర్దేశిత అభ్యసన ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా డిజిటల్ సాధనాలను వినియోగించడం ద్వారా బోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని విద్యార్థుల అభ్యసనలో ప్రత్యక్షంగా ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ డాక్టర్ పి.ఎం. షేక్ పాల్గొని శిక్షణ అంశాలపై ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం అందించారు. జిల్లాలోని 14 మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు హాజరయ్యారు.

## టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో ఎలిగేడు మండలానికి అరుదైన గుర్తింపు

**ఎలిగేడు, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల పరిధిలోని ఐదు గ్రామాలు టీబీ రహిత గ్రామాలుగా ఎంపికై అరుదైన గుర్తింపు సాధించాయి. మండలంలోని నర్సాపూర్, ర్యాకల్ దేవ్ పల్లి, లోకపేట, రాములపల్లి, నారాయణపల్లి గ్రామ ప్రజాప్రతినిధులకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారి పవిత్ర ప్రశంసా పత్రాలను అందజేశారు. క్షయ వ్యాధి నివారణకు వైద్యాధికారులు, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి బాధితులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడం వల్లనే ఈ గుర్తింపు దక్కిందని అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిస్సి క్రిస్టియానా, స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు ఉద్యమించాలి

**- పేరాల మహేశ్వర్ రావు.**



**రామగిరి, అక్టోబర్ 08 (ప్రజాజ్యోతి) :**
రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, ప్రక్రియ పేరుతో ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని రామగిరి మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పేరాల మహేశ్వర్ రావు ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. "సార్" ప్రక్రియపై నెలకొన్న వివాదాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను తెలియజేయాలని మహేశ్వర్ రావు పత్రికా ప్రకటన ద్వారా కోరారు.



## విద్యుత్ సరఫరా కోసం రోడ్డెక్కి అన్నదాతల ఆందోళన

**మంథని, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
పంట పొలాలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదంటూ మంథని మండలం ఏక్లాస్‌పూర్ రైతులు గురువారం మంథని–కాటారం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. అధికారులు పది గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆరు గంటలు కూడా రావడం లేదని, తరచూ ఎల్సీల పేరుతో కోతలు విధిస్తుండటంతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో గంటపాటు వాహనాలు నిలిచిపోగా, మంథని పోలీసులు చేరుకుని రైతులకు నచ్చజెప్పి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.ం

## ప్రభుత్వ వైద్య శిబిరానికి విశేష స్పందన



**గంగాధర 08/అక్టోబర్/2026:**
(ప్రజా జ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో, బీపీలు, షుగర్లు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న చాలా మంది ప్రజలు వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకొని, మాత్రలను తీసుకువెళ్ళారు. గ్రామ సర్పంచ్ గునుకొండ యశోద, ఉపసర్పంచ్ పంజాల క్రీష్మ, కార్యదర్శి లావణ్య, డాక్టర్. జగదీప్, వైద్య సిబ్బంది ఉన్నారు

## జూమ్ బరా బార్' ఫ్లాష్ మాబ్‌తో మార్మోగిన ఎక్స్‌ప్లోరికా పాఠశాల

**కరీంనగర్ టౌన్,అక్టోబర్ 8( ప్రజాజ్యోతి)**
జ్యోతినగర్‌లోని ఎక్స్‌ప్లోరికా ప్రీమియం పాఠశాలలో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని 'జూమ్ బరా బార్' పేరుతో ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంగీతం, నృత్యాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ, దసరా పండుగల విశిష్టతను ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థుల ప్రదర్శనలకు తల్లిదండ్రులు ఉత్సాహంగా స్పందించి వారితో కలిసి నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ



సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారమిత, ఎక్స్‌ప్లోరికా పాఠశాలల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, రశ్మితా ప్రసాద్, రాకేష్ ప్రసాద్, వి.యు.ఎమ్. ప్రసాద్, ప్రాచి, వినోద్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు శర్మిష్ఠ, సమన్వయకర్త ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భార్యపై కత్తితో దాడి.. భర్త అరెస్ట్

**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 08, (ప్రజాజ్యోతి):**
భార్యపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడైన భర్తను కొత్తపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇడుగునూరి భద్రయ్య కుమార్తె రేణుకకు సుమారు 20 ఏళ్ల క్రితం కోహెడ గ్రామానికి చెందిన జలగం శ్యామ్‌తో వివాహమైంది. శ్యామ్ మద్యానికి బానిసై భార్యపై అనుమానం పెంచుకోవడంతో తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 6న రేణుకపై శ్యామ్ కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పరారైన నిందితుడు సిద్దిపేట, కోహెడ మండలాల్లో సంచరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు గురువారం కొత్తపల్లి వైపు వస్తున్న శ్యామ్‌ను చింతకుంట వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించింది. నిందితుడిని చాకచక్యంగా




పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ పరుశరాములు, కానిస్టేబుల్ శ్రీనాథ్‌లను కొత్తపల్లి ఎస్‌హెచ్‌ఓ బిల్లా కోటేశ్వర్ అభినందించారు.

# సైబర్ మోసానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**వేములవాడ, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
ఆర్‌టీఓ అధికారిగా నమ్మించి డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ పేరుతో సైబర్ మోసానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. హన్మాజిపేట గ్రామానికి చెందిన



శ్రీనివాస్ అనే వ్యక్తికి ఆర్‌టీఓ అధికారిగా ఫోన్ చేసి లైసెన్స్ బ్లాక్ అవుతుందని భయపెట్టి, ఫోన్ పే ద్వారా రూ.4,200 కాజేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో వేములవాడ అర్బన్ కాలనీకి చెందిన నిందితుడు నీరటి తిరుమల్‌ను గురువారం అదుపులోకి తీసుకుని, మోసానికి ఉపయోగించిన సెల్‌ఫోన్, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో ఆర్‌టీఓ కన్సల్టెన్సీలో పనిచేసిన అనుభవంతో పలువురిని మోసం చేసినట్లు విచారణలో తేలిందని, ప్రభుత్వ అధికారుల పేర్లతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి డబ్బులు పంపవద్దని సీఐ ప్రజలను కోరారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు

**హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ**

**వేములవాడ, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
తెలుగు సాహిత్యం, కళారంగాలలో మైలురాయిగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు అడివి బాపిరాజు 131వ జయంతి సందర్భంగా వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. 'బావ బావ పన్నీరు' ప్రసిద్ధ జానపద గీతాన్ని అందించిన బాపిరాజు రచయితగా, చిత్రకారుడిగా, సినీ కళాదర్శకుడిగా, 'మీజాన్' పత్రిక సంపాదకుడిగా బహుముఖ సేవలు అందించారని కొనియాడారు. హిమబిందు, నారాయణరావు, గోన గన్నారెడ్డి వంటి అద్భుత నవలతో పాటు తెలంగాణ ప్రాంతంలో సాహిత్య చైతన్యానికి ఆయన చేసిన సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, మోహన్, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# టీబీ రహిత గ్రామంగా గోపాలపల్లి ఎంపిక



**ముస్తాబాద్, అక్టోబర్ 8 ( ప్రజా జ్యోతి):** టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గోపాలపల్లి గ్రామం టీబీ రహిత గ్రామంగా ఎంపికైంది. పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పరిధిలో నామాపూర్ సబ్ సెంటర్ లో నిర్వహించిన ఆరోగ్య కార్యక్రమాల ద్వారా గ్రామంలో టీబీ వ్యాధిగ్రస్తులు లేని గ్రామంగా గోపాలపల్లి గుర్తింపు పొందింది. టీబీ వ్యాధి నిర్మూలనలో భాగంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహించారు. టీబీ లక్షణాలు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేయించడం, వ్యాధి నిర్ధారణ అయితే సకాలంలో చికిత్స అందించడం వంటి చర్యలు చేపట్టారు. ప్రజలకు టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కృషి ఫలితంగా గోపాలపల్లి గ్రామం టీబీ రహిత గ్రామంగా ఎంపిక కావడం పట్ల గ్రామ ప్రజలు, ఆరోగ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గోపాలపల్లి గ్రామానికి సంబంధించిన అవార్డును ఏఎన్ఎం జలేంద్ర (సిస్టర్) అందుకున్నారు. గోపాలపల్లి గ్రామం టీబీ రహిత గ్రామంగా ఎంపిక కావడంలో సహకరించిన వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలను పలువురు అభినందించారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో టీబీ వ్యాధి నివారణకు ప్రజలు, ఆరోగ్య శాఖ సమన్వయంతో మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

# పరిశుభ్రతే ప్రథమ ప్రాధాన్యం

## మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆదేశించారు. గురువారం స్థానిక కౌన్సిలర్ మామిండ్ల అమర్వ లక్ష్మీరాజముతో కలిసి 26వ వార్డులో చేపట్టిన 'సానిటేషన్ స్పెషల్ డ్రైవ్' పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. స్వచ్ఛ పట్టణ సాధన కోసం ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి మున్సిపాలిటీ స్వచ్ఛ ఆటోలకు అందిస్తూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కమిషనరేట్‌లో పోలీసుల నాకాబందీ

## మూడు డివిజన్లలో ఏకకాలంలో తనిఖీలు





**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 08, (ప్రజాజ్యోతి):** నేరాల నియంత్రణ, అనుమానితుల కదలికలపై నిఘా, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి విస్తృతంగా నాకాబందీ నిర్వహించారు. సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కరీంనగర్ టౌన్, రూరల్, హుజూరాబాద్ మూడు డివిజన్లలోని ప్రధాన కూడళ్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, సున్నిత ప్రాంతాల్లో ఏకకాలంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు ఏసీపీలు,15 మంది సీఐలు, 27 మంది ఎస్సైలు, 54 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు,130 మంది కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ విభాగానికి చెందిన ఆరుగురు సిబ్బంది, ఎస్ఏటీకి చెందిన ఆరుగురు ఎస్సైలు, 18 మంది కానిస్టేబుళు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జంక్షన్, బోట్ జంక్షన్, బస్టాండ్, గీతాభవన్ సెంటర్, పద్మానగర్ జంక్షన్, ఆదర్శనగర్, బొమ్మకల్, తీగలగుట్టపల్లి, రేకుర్తి, అలుగునూర్, చింతకుంట, మానకొండూర్, గంగాధర, హుజూరాబాద్, పరకాల క్రాస్‌రోడ్, కేశవపట్నం, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలతో పాటు అనుమానాస్పద వాహనాలను నిలిపి వాహన పత్రాలు, నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అక్రమ రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడమే తనిఖీల ప్రధాన ఉద్దేశమని సీపీ గౌష్ ఆలం తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని, పోలీసుల తనిఖీలకు ప్రజలు సహకరించాలని సీపీ కోరారు.

### బొడిగె మల్లయ్య గౌడ్ నేత్రాలు సజీవం



**చొప్పదండి, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):** చొప్పదండి పట్టణం కు చెందిన బొడిగె మల్లయ్య గౌడ్ (70) అనారోగ్యంతో మరణించగా లయన్స్ క్లబ్ సభ్యులు కొల్లూరి జితేందర్ నేత్రదానం పై అవగాహన కల్పించి తన కుమారులు బొడిగె శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్ అనుమతితో నేత్రాలను ఎల్ వి ప్రసాద్ ఆసుపత్రి టెక్నీషియన్ గాజుల సతీష్ ద్వారా సేకరించి హైదరాబాదులోని ఎల్ వి ప్రసాద్ ఆసుపత్రి కి తరలించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యుడు కొల్లూరి జితేందర్ మాట్లాడుతూ మల్లయ్య నేత్రాలు ఇద్దరు అంధులకు చూపును ఇస్తాయని, తాను భౌతికంగా మరణించినా నేత్రాలు సజీవంగా ఉంటాయని అన్నారు. పుట్టెడు దుఃఖంలోనూ ఉదారత చాటిన మృతుడి కుటుంబ సభ్యులను అభినందించారు.



### నూతన ఎస్సై కి సన్మానం

**చొప్పదండి, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):** చొప్పదండి ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.రాజ్ కుమార్ ను భారత్ మినీ డోర్ ఆటో అసోసియేషన్ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యామ తిరుపతి, అధ్యక్షుడు పాలూరు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రేగుల సతీష్, కోశాధికారి లంక రవి, ప్రధాన కార్యదర్శి పోగుల రమేష్ పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు డబ్బులు విడుదల చేయాలి



**చొప్పదండి, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు డబ్బులు విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని చొప్పదండి మండల బి ఆర్ఎస్ నాయకుడు బిసవేణి రాజశేఖర్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, 5 లక్షల రూపాయల సబ్సిడీ ఇస్తామని కూడా ప్రకటించిందని పేర్కొన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులకు మూడున్నర లక్షలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఒక లక్ష రూపాయలు భార్యాభర్తలకు ఉపాధి పని కింద చూపెడుతున్నారని, మిగతా రు.50,000 జీఎస్టీ పేరుతో ఇవ్వడం లేదని ఆరోపించారు. మూడున్నర లక్షలు విడుదల చేయడానికి కూడా చాలా నెలలు గడుస్తున్నవని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇస్తున్న డబ్బు తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టడానికే సరిపోతుందని, అసలు కట్టడానికి ఇల్లు విక్రయించే పరిస్థితి ఉందని అన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి షరతులు లేకుండా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## నిరుపేద వైద్యానికి 2 లక్షల సిఎమ్ఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు

**ఇల్లంతకుంట అక్టోబర్ 8(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెల్జిపురం గ్రామానికి చెందిన కంకణాల లక్ష్మారెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఏంఎల్ఏ ముఖ్యమంత్రి సహాయనిధి సి ఎమ్ ఆర్ ఎఫ్ 2,00,000/- (రెండు లక్షల రూపాయలు) ఎల్ఓసి మంజూరూ చేయించగా గురువారం రోజు స్థానిక సర్పంచ్ నాయిని నవీన్కుమార్ బాధితునికి అందజేశారు ఈ సందర్భంగా బాధితుడు తనవైద్య సహాయానికి సహకరించిన మానకొండూర్ ఎమ్మెల్యేకి సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, పిఏసి ఎస్ డైరెక్టర్ గుండ వెంకన్న, ఉప సర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

## కోనరావుపేట మండల ట్రాక్టర్ యూనియన్‌కు కొత్త సారథులు

**కోనరావుపేట, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ నూతన అధ్యక్షుడిగా ఎక్కాలదేవి అనిల్, ఉపాధ్యక్షులుగా దండు మహిపాల్, సుంకరి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడిగా రావులపల్లి మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంగుల ప్రశాంత్, కోశాధికారిగా చిద్రవేణి భానుచందర్ నియమితులయ్యారు. ఎన్నిక అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను పలువురు శాలువాలు, పూలబొకేలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ ట్రాక్టర్ యజమానుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల ట్రాక్టర్ యజమానులు, సభ్యులు పాల్గొన్నారు.



# మనవడి పుట్టినరోజున వృద్ధాశ్రమంలో వస్త్రాల పంపిణీ



**సుల్తానాబాద్, అక్టోబరు 8: (ప్రజా జ్యోతి)**

పుట్టినరోజు వేడుకలను హంగూ ఆర్భాటాలతో నిర్వహించకుండా.. ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వాలనే లక్ష్యంతో సుల్తానాబాద్‌కు చెందిన ప్రముఖ రైస్‌మిల్లుల వ్యాపారవేత్త, పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కొమురవెల్లి రామ్మూర్తి, సత్తెమ్మ దంపతులు తమ మనవడు శ్రీశాంక్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని మార్కండేయకాలనీలో గల ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధులకు నూతన దుస్తులను అందజేశారు. వృద్ధులకు ముందుగానే పాయింట్, షర్ట్ కుట్టించేందుకు కొలతలు తీసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా దుస్తులను సిద్ధం చేయించి అందించడం కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని పురుషులు, మహిళలు శ్రీశాంక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొమురవెల్లి రామ్మూర్తి--సత్తెమ్మ దంపతులతో పాటు వారి కుమారుడు, కోడలు రాజేష్, ప్రియాంక దంపతులను, మనవళ్లు శ్రీశాంక్, శ్రేయాంక్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కొమురవెల్లి రామ్మూర్తి, సత్తెమ్మ దంపతులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను ఆర్భాటంగా నిర్వహించుకోవడం కంటే అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం ద్వారా కలిగే సంతృప్తి ఎంతో గొప్పదన్నారు. కుటుంబంలో జరిగే శుభకార్యాలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టడం ద్వారా సమాజంలో మానవతా విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, లక్ష్మి, వృద్ధాశ్రమం కో-ఆర్డినేటర్ గట్టు స్వామి, నరేష్, ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి

- హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి..
- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలి
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలి
- తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే హెచ్ (143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 8 ప్రజాజ్యోతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని, హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే హెచ్ (143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. గురువారం అయన జిల్లాలోని తన స్వగ్రామం వంతనికి వెళ్లి హైదరాబాద్ తిరిగి వెళుతున్న సమయంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం జర్నలిస్టు సంక్షేమ నిధిని రూ. 200ల కోట్లకు పెంచాలని, త్వరలో జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి టియుడబ్ల్యుజే మహాసభలను నిర్వహిస్తామన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ జర్నలిస్ట్ సంక్షేమ నిదికి ఇచ్చిన 42 కోట్లకు కాంగ్రెస్ మూడేండ్ల కాలం లో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. గత ప్రభుత్వం మరణించిన జర్నలిస్ట్ కుటుంబానికి లక్ష రూపాయలు ఇచ్చిందని గుర్తు చేశారు. దాన్ని లక్ష రూపాయలు నుంచి 2 లక్షలకు రూపాయలకు పెంచి ఇస్తామని చెప్పినా ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఆ రెండు లక్షలకు పెంచుతామన్న హామీని అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో హౌసింగ్ సొసైటీ ద్వారా 60% మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ గవర్నమెంట్ లో ఇంతవరకు అసలు ఇళ్ల స్థలాలు ఇప్పించలేదన్నారు. త్వరలో టీయూడబ్ల్యూజే హెచ్ (143) జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా స్థాయి సమావేశాలతో పాటు రాష్ట్ర స్థాయి మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అల్లం నారాయణను జిల్లాలోని జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టె సదానందం, టీయూడబ్ల్యూజే నేషనల్ కౌన్సిల్ మెంబర్ అంకరి ప్రకాష్, కాల్వ రమేష్, నరేంద్ర చారి, శిలారపు కిషన్, కొయ్యడ తిరుపతి, తూర్పాటి శ్రీనివాస్, దొమ్మటి రాజేష్, కత్తెర్ల తిరుపతి, తిర్రి తిరుపతి, మేకల సంతోష్, కళ్యాణ్, సతీష్, తిర్రి సుధాకర్, లక్ష్మణ్, తిర్రి శంకర్, అంజయ్య, రాజు యాదవ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు




**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 08, ప్రజా జ్యోతి:**
పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల బతుకమ్మలను తీసుకువచ్చి ఆటపాటలతో సందడి చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పూల సోయగాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టత, ప్రకృతితో మన సంస్కృతి సంప్రదాయాలకు ఉన్న అనుబంధాన్ని చిన్నారులకు వివరించారు. పూలనే పూజించే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ అని, ప్రకృతిని గౌరవించడం మన సంప్రదాయంలో భాగమని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటల్లో పాల్గొని ఆనందించారు. కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ, ప్రైమరీ ఉపాధ్యాయుల బృందం పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు.

# ‘టీబీ ముక్త పంచాయతీ’గా నీరుకుళ్లకు గుర్తింపు



**సుల్తానాబాద్, అక్టోబరు 8: (ప్రజా జ్యోతి)**
క్షయ వ్యాధి నిర్మూలనలో విశేష ప్రగతి సాధించినందుకు సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల గ్రామ పంచాయతీకి ‘టీబీ ముక్త్ పంచాయతీ–2025’గా గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అదనపు కలెక్టర్ బి. రాములు చేతుల మీదుగా ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, గ్రామ సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గ్రామంలో క్షయ వ్యాధి నియంత్రణకు వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ) సిబ్బంది చేపట్టిన కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, ప్రజలు సహకరించారు. అనుమానితులను గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా చర్యలు తీసుకోవడం, ప్రజల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించారు. దీంతో గ్రామ పంచాయతీకి టీబీ ముక్త్ పంచాయతీగా గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ గుర్తింపు ఒక్కరి కృషి వల్ల సాధ్యమైనది కాదని, గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎన్‌టీఈపీ సిబ్బంది, గ్రామ ప్రజల సమష్టి కృషి ఫలితమేనని అన్నారు. నీరుకుళ్లను ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు మరింత సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# కోతుల దాడులతో బొప్పాపూర్ గ్రామస్తుల బెంబేలు



**కోతుల నివారణకు పాలకవర్గం చొరవ**

**రూ.3.20 లక్షలతో గ్రామంలో మొదలైన**

**కోతుల పట్టివేత**

**ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. ఇళ్ల వద్దకు, వీధుల్లోకి వస్తున్న కోతులు గ్రామస్తులపై వరుసగా దాడులకు పాల్పడుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాణాలు దక్కించుకునేందుకు ఓ వృద్ధురాలు బావిలో దూకగా, మరి కొందరు కోతుల దాడిలో గాయపడ్డ ఘటనలు ఉన్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి, ఉప సర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డితో పాటు పాలకవర్గం చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 3.20 లక్షల వ్యయంతో కోతులను పట్టే కార్యక్రమాన్ని గ్రామంలో ప్రారంభించారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా కోతులను పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు చల్లా పద్మా రెడ్డి కొత్త ప్రసాద్ మరియు శ్రీ బాబు పోచంపల్లి రాజు లంబ కుమార్, ఏలూరు శ్రీనివాస్ పాల్గొన్నారు





## బతుకమ్మ ఏర్పాట్లలో సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ

**సుల్తానాబాద్, అక్టోబరు 8: (ప్రజాజ్యోతి) :**
సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ ఆధ్వర్యంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. బతుకమ్మలు ఆడుకునే ప్రదేశాన్ని ట్రాక్టర్ సాయంతో చదును (లెవెలింగ్) చేయిస్తున్నారు. ప్రదేశంలో ఉన్న మట్టి, గుంతలను తొలగించి మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మ ఆడుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా బతుకమ్మ వేడుకల సమయంలో మహిళలకు ఇబ్బందులు లేకుండా ప్రాంగణంలో లైటింగ్ ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. గ్రామంలో బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా, సౌకర్యవంతంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ తెలిపారు.

## ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు కృతజ్ఞతలు .

**కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి)**
కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట్ గ్రామంలో గల . త్రీ ఎంబీఏ కెపాసిటీ కలిగిన విద్యుత్ సబ్ స్టేషన్ లో.త్రీ కెపాసిట్ నుండి ఫైవ్ ఎం వి ఏ  కెపాసిటీకి పెంచించిన సందర్భంగా ప్రభుత్వ విప్పు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావుకు. మీర్జంపేట్ గ్రామ సర్పంచ్ పోషాలశైలజ. సదానందం గౌడ్ లఆధ్వర్యంలో గుర–ువారం రోజున గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో .కాంగ్రెస్ పార్టీ నాయకులు .ఆ గ్రామ రైతులు. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేణసదయ్య .వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి .మాజీ ఎంపీటీసీ మొగిలి సదానందం. కాంగ్రెస్ పార్టీ నాయకులు .రైతులు తదితరులు.అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# ఢిల్లీలో ఓబీసీ సమావేశం.

**హాజరైన మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్.**

**కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి)**
దేశ రాజధాని ఢిల్లీలో ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాన్స్టిట్యూషన్ క్లబ్లో గురువారం రోజున ఏర్పాటు చేసిన సమావేశానికి .మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఓ బి సి కులాల హక్కుల సాధనకై. ఈ నెల 14. 15 రెండు రోజులు ఢిల్లీలో జరిగే ధర్నాకు. జాతీయస్థాయిలో గల ఓబిసి కులస్తులు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు: ఎస్సై రమేష్



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ హెచ్చరించారు. గురువారం ధూమాల గ్రామ శివారులో పదిర మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్ అదరవేణి పరశురాములుతో పాటు యజమాని ఉప్పుల ప్రభాకర్పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా నిరోధానికి పోలీసులు నిరంతరం తనిఖీలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అక్రమ రవాణాను అరికట్టడంలో స్థానిక ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్సై కోరారు.

## కులం పేరుతో దూషించిన కేసులో డీఎస్పీ విచారణ



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
కులం పేరుతో దూషించి, కాంపౌండ్ వాల్ ధ్వంసం చేసిన ఘటనపై సిరిసిల్ల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ) కె. నాగేంద్ర చారి గురువారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొప్పెల్లి సత్తవ్వ ఇంటి వద్దకు గన్న పద్మారెడ్డి, గన్న బాల్రెడ్డి వచ్చి కాంపౌండ్ వాల్ను ధ్వంసం చేయడంతో పాటు తమను కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మోకాపైకి చేరుకున్న డీఎస్పీ సంఘటన స్థలాన్ని పరిశీలించి, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించామని, విచారణ అనంతరం నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

# ఆత్మరక్షణకు తైక్వాండో శ్రీరామరక్ష

**సుద్దాలలో విద్యార్థులకు బెల్ట్ ప్రధానం**



**కోనరావుపేట,అక్టోబర్.08 (ప్రజాజ్యోతి) :**
తైక్వాండో నేర్చుకోవడం వల్ల ఆపద సమయంలో ఆత్మరక్షణ చేసుకోవడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని సర్పంచ్ కుంటెల్లి నాగరాజు అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని రుషి వాణి విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో గురువారం సన్ రైస్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలంటే ప్రతి బాలిక తైక్వాండో వంటి విద్యలు నేర్చుకోవాలని సూచించారు. తైక్వాండో వల్ల క్రమశిక్షణ, మనోధైర్యం, శారీరక దారుఢ్యం పెరుగుతాయని తెలిపారు. విద్యతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలని, బాలికలు తైక్వాండో నేర్చుకునేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన తైక్వాండో విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అర్హత సాధించిన 30 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎర్రవెల్లి దాసు, తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి సంతోష్, సన్ రైస్ తైక్వాండో అకాడమీ మాస్టర్ ఎం. శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకుడు కాశవేణి మహేష్, కొలనూర్ సింగిల్ విండో డైరెక్టర్ ఉప్పుల గంగయ్య, వార్డు సభ్యులు బుర్ర రమేష్, ఎర్రవెల్లి విజయ్, నాయకులు వంగల భూమేష్ గౌడ్, తైక్వాండో మాస్టర్లు రాచకొండ విజయ సింహాచారి, లోలపు దేవరాజు, సుంకరి శరత్, విద్యార్థులు, పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- 12వందల లీటర్ల గుడుంబా బెల్లం పానకం
- 20 లీటర్ల నాటు సారాయి ధ్వంసం
- మరో కేసు నమోదైతే పీడీ యాక్ట్
- బేగంపేట గుడుంబా స్థావరాలపై ప్రత్యేక దృష్టి
- మంథని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్



**మంథని, అక్టోబర్ 08 (ప్రజాజ్యోతి):**
పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్ పేట గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం తెల్లవారుజామున మెరుపు దాడులు నిర్వహించారు. మంథని పట్టణంలోని బోయిన్ పేట నివాస గృహాలకు ఆనుకొని ఉన్న బొక్కల వాగు పరిసర ప్రాంతాలతో పాటు తుమ్మ పొదల ప్రాంతంలో మంథని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పెద్దపెల్లి ఎక్సైజ్ సీఐ రజిత రెడ్డి తో పాటు పెద్దపల్లి జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్ వైద్య, మంథని ఎక్సైజ్ ఎస్ఐ బాలు నాయక్ లు సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై ముకుమ్మడిగా దాడులు నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ పెద్దపెల్లి డిపిఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు అధికారులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో సుమారు 1200 లీటర్ల గుడుంబా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లం పానకం, 20 లీటర్ల గుడుంబా నాటు సారాయిని ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు ఇతర సామగ్రిని సైతం అధికారులు ధ్వంసం చేశారు గుడుంబా తయారు చేసిన వ్యక్తుల ఎవరనేది విచారణ చేస్తున్నట్లు మంథని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. బోయిన్ పేటలో కొంతమంది అనుమానిత పేర్లను సేకరించినట్లు అనుమానితులతో పాటు ఇళ్లను గుర్తించినట్లు ఆ వ్యక్తులపై రాబోయే రోజులలో ఎక్సైజ్ శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానిత వ్యక్తుల పైన బోయిన్ పేటలో 2 నుండి 3 కేసులు గతంలో నమోదు చేయబడ్డయన్నారు. మరో కేసు నమోదు అయితే పీడీ యాక్ట్ చేస్తామని వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను ఆపివేయమని పై అధికారులకు సిఫారసు చేస్తామని చెప్పి సీఐ హెచ్చరించారు. మరి కొంత మంది వివరాలు సేకరించి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్ శాఖ పోలీసు శాఖ సహాయ సహకారాలు తీసుకుంటామని సీఐ తెలిపారు. అంతేకాకుండా రామగిరి మండలం బేగంపేటపై ప్రత్యేక దృష్టి పెట్టామని బేగంపేటలో కూడా పెద్ద ఎత్తున గుడుంబా స్థావరాలు ఉన్నాయని పక్క సమాచారం ఉందని దానికి సంబంధించి కూడా పూర్తి సమాచారం సేకరిస్తున్నామని అక్కడి వారిపై కూడా ఎక్సైజ్ శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో మంథని సిబ్బందితో పాటుగా పెద్దపల్లి ఎక్సైజ్ సిబ్బంది, పెద్దపల్లి టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే కచ్చితంగా జరగాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

- రెవెన్యూ, సర్వే శాఖల అధికారులకు శిక్షణ
- 18 రోవర్ యంత్రాలతో రీ సర్వే వేగవంతం



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 'భూభారతి' కింద చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో కచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, జీపీఓలు, సర్వేయర్లు మరియు లైసెన్స్ సర్వేయర్లకు గురువారం నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రీ సర్వే కోసం 18 రోవర్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్వేకు ముందు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సరిహద్దులు నిర్ణయించాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు పారదర్శకంగా, వేగవంతంగా రీ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ



సమావేశంలో ఏడీ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) శ్రీనివాస్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయ అవగాహనతోనే హక్కుల పరిరక్షణ

- వీర్నపల్లిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సదస్సు
- బలహీన వర్గాలకు న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని వెల్లడి




**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):**

ప్రజలకు చట్టాలపై అవగాహన పెంపొందించి, అందరికీ సులభంగా న్యాయం అందించాలనే లక్ష్యంతోనే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారి సమన్వయంతో గురువారం వీర్నపల్లి మండల కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి చట్టాలపై అవగాహన అత్యవసరమని, దాని ద్వారానే తమ హక్కులను రక్షించుకోగలరని పేర్కొన్నారు. సమాజంలో బలహీన వర్గాలు, మహిళలు, పిల్లలు, వృద్ధుల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు గుర్రం ఆంజనేయులు, న్యాయవాదులు బూర మధుసూదన్, కోనేటి నరేష్, ఎస్సై లక్ష్మణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి పోషణ మేళా ప్రారంభం

- సిరిసిల్లలో ఘనంగా జాతీయ పోషణ మాసం వేడుకలు
- తొలి 1,000 రోజులు చిన్నారులకు అత్యంత కీలకం: సీడీపీవో సబితా

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):**

సిరిసిల్లలోని కళ్యాణ లక్ష్మి గార్డెన్‌లో జిల్లా సంక్షేమ అధికారి (ఐసీడీఎస్) లక్ష్మీరాజం అధ్యక్షతన జాతీయ పోషణ మాసం--2026 సందర్భంగా జిల్లా స్థాయి పోషణ మేళా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్లు, వార్డు కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ శాఖల సమన్వయంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ఈ మేళా లక్ష్యమని తెలిపారు. సభలో సీడీపీవో సబితా మాట్లాడుతూ.. శిశువు ఎదుగుదలలో తొలి 1,000 రోజులు కీలకమని, సరైన పోషకాహారం మరియు తల్లిపాలు అందించాలని సూచించారు. డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం అంగన్వాడీ సేవల ప్రాధాన్యతను వివరిస్తూ పిల్లల సమగ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ సమతుల్య ఆహార ప్రాధాన్యతను, జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొని పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు.



## నగునూరు దుర్గా భవాని ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి ):**

నగునూరులోని శ్రీ పరివార సమేత శ్రీ దుర్గా భవాని దేవాలయంలో ఈ నెల 10 నుంచి 21 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్, వంశపారంపర్య చైర్మన్ వంగల లక్ష్మణ్ తెలిపారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్సవాల వివరాలను వెల్లడించారు. శృంగేరి పీఠాధిపతులు అందించిన పట్టు వస్త్రాలు, మంత్రాక్షింతలతో గురువారం సాయంత్రం కరీంనగర్ ప్రకాశం గంజ్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం నుంచి నగునూరు ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారి మూలవిరాట్టుకు 8 కిలోల బంగారంతో కవచాలు తయారు చేయాలని నిర్ణయించామని, భక్తులు కనీసం ఒక గ్రాము బంగారం సమర్పించి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అక్టోబర్ 10న అభిషేకం, ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమై, 11 నుంచి వివిధ రూపాల్లో అమ్మవారి అలంకరణలు, చండీహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 20న విజయదశమి సందర్భంగా శమీపూజ, రామ్‌లీల, 21న పట్టాభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నట్లు వంగల లక్ష్మణ్, శృంగేరి పీఠం సీఈఓ పీఏ మురళి తెలిపారు.

## కిసాన్‌నగర్ బండి సంజయ్ అడ్డా: బీజేపీ

**కరీంనగర్, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):**

కిసాన్‌నగర్ ప్రాంతం బీజేపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కంచుకోట అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కిసాన్‌నగర్ నుంచి చింతల వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో వారు మాట్లాడారు. కిసాన్‌నగర్‌లో జరిగిన అభివృద్ధి పనులకు స్మార్ట్‌సిటీ నిధులు ప్రధాన కారణమని, బండి సంజయ్ కృషితో కేంద్రం నుంచి కరీంనగర్‌కు భారీగా నిధులు వచ్చాయని పేర్కొన్నారు. 66 కార్పొరేషన్ స్థానాల్లో బీఆర్ఎస్ కేవలం 8 స్థానాలకే పరిమితం కావడం గంగుల కమలాకర్ వైఫల్యానికి నిదర్శనమన్నారు. గంగుల కమలాకర్ హయాంలో చేపట్టిన ఐటీ టవర్, మానేరు రివర్‌ఫ్రంట్, కేబుల్ బ్రిడ్జి అభివృద్ధిపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. గంగుల అవినీతిపై గతంలో అసెంబ్లీలో చర్చ జరిగిందని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్ని విమర్శలు చేసినా కిసాన్‌నగర్ ప్రజల మద్దతు బీజేపీకే ఉంటుందని స్పష్టం చేశారు. ర్యాలీలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావుతో పాటు పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు..





## ఓబీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం

**పార్లమెంటు ముట్టడికి పెద్దపల్లి ఓబీసీ నేతల పిలుపు**

**పెద్దపల్లి, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో కుల గణనను చేర్చాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన జాతీయ ఓబీసీ సమావేశానికి పెద్దపల్లి జిల్లా నేతలు హాజరయ్యారు. బహుజన ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ, మాజీ ఎంపీపీ గొప్పగోని సారయ్యగౌడ్ పాల్గొన్న ఈ సమావేశంలో పలువురు జాతీయ నేతలు మాట్లాడుతూ ఓబీసీ హక్కుల సాధనకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కుల గణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని, రాబోయే శీతాకాల సమావేశాల సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 10 వేల మందితో ఢిల్లీ పార్లమెంటును ముట్టడిస్తామని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పప్పు యాదవ్, డి.రాజా, రామకృష్ణ, వి.హనుమంతరావు, యోగేంద్ర యాదవ్, జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసీపై కాంగ్రెస్ ఆగ్రహం

**కోనరావుపేటలో బీజేపీ, సీఈసీ దిష్టిబొమ్మ దగ్ధం**

**కోనరావుపేట, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తీరును నిరసిస్తూ కోనరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం నిరసన తెలిపి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఏఐసీసీ, పీసీసీ, మండల అధ్యక్షుడు మానుక సత్యం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాల ఉనికిని దెబ్బతీస్తూ రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ముదాం ప్రదీప్, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మేడిపల్లి ఓపెన్ కాస్ట్ మూసి వేత పనుల పరిశీలన

**గోదావరిఖని, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి)** మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో 'ఫైనల్ మైన్ క్లోజర్' పనులను ప్రముఖ విద్యాసంస్థఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐ ఐ ఈ ఎస్ ), శిబ్‌పూర్ (పశ్చిమ బెంగాల్) కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డా. గంగోపాధ్యాయ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆర్జీ.× పరిధిలోని మేడిపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో చేపడుతున్న తుది గని మూసివేత భూ పునరుద్ధరణ పనులను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం ప్రతి గని మూసివేత పనులను థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తనిఖీ చేయించడంలో భాగంగానే ప్రొఫెసర్ గంగోపాధ్యాయ నేతృత్వంలోని బృందం ఈ తనిఖీలు చేపట్టింది. సుమారు 30 సంవత్సరాల పాటు దేశ ఇంధన అవసరాలకు నిరంతరాయంగా బొగ్గును అందించిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో బొగ్గు నిల్వలు పూర్తిగా తరిగిపోవడంతో 2022 లో ఉత్పత్తి కార్యకలాపాలను సింగరేణి యాజమాన్యం నిలిపివేసింది. అనంతరం డీజీ ఎం ఎస్ పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని తిరిగి యథాతథ స్థితికి తీసుకురావడానికి సింగరేణి భారీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా




గనిలోని ఖాళీ ప్రదేశాన్ని (ఓవర్ బర్డెన్) మట్టితో పూడ్చడం ఉపరితలాన్ని వ్యవసాయానికి అనుకూలంగా చదును చేయడం నీటి నిల్వ,నేల కోతను నివారించే చర్యలను పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ప్రొఫెసర్ గంగోపాధ్యాయ మొదట మేడిపల్లి ప్రాంతంలో చేపట్టిన బ్యాక్ ఫిల్లింగ్ పనుల నాణ్యతను,నేల స్థిరత్వాన్ని,నాటిన మొక్కల పెరుగుదలను పరిశీలించారు. గనిని తిరిగి సాధారణ భూమిగా అటవీ ప్రాంతంగా మార్చే ప్రక్రియ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆర్జీ. 1 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ లకిడి రమేష్ మేడిపల్లి మైన్ క్లోజర్ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటివరకు చేసిన ఖర్చు,భవిష్యత్ నిర్వహణ ప్రణాళికలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ విభాగం జీఎం సుజాయ్ ముజెందార్, యస్. ఓ. టు జియం కె. చంద్రశేఖర్, డిజియం ఫారెస్ట్ కర్ణ, కార్పొరేట్ పర్యావరణ విభాగం మరియు ప్రాజెక్ట్ ప్లానింగ్ విభాగం నుండి అడిషనల్ మేనేజర్లు తిరుపతి, శంకర్, రవీంద్రనాథ్, ఆర్జీ. ఏరియా సర్వే ఆఫీసర్ లక్ష్మి రాజం, పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు పాల్గొన్నారు.

# తెగిపోయిన కాజ్‌వేకు తాత్కాలిక పునరుద్ధరణ

- సర్పంచ్ లక్ష్మారెడ్డి చొరవతో మామిడిపల్లి - నిజామాబాద్ దారి సిద్ధం
- పండుగల వేళ ఊపిరి పీల్చుకున్న రెండు గ్రామాల ప్రజలు

**కోనరావుపేట, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):** కోనరావుపేట మండలం మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల మధ్య రాకపోకలకు ఆటంకంగా మారిన మూలవాగు కాజ్‌వేకు ఎట్టకేలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూలవాగు ఉధృతికి కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోవడంతో రెండు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. ప్రస్తుతం బతుకమ్మ, దసరా



పండుగలు సమీపిస్తుండటంతో సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ కాసర్ల పవిత్ర, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జేసీబీతో పైపులు అమర్చి మొరం పోసి దారిని పునరుద్ధరించారు. పండుగల వేళ దారిని సిద్ధం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా ప్రభుత్వం శాశ్వత బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు



## ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం

**కోనోకార్పస్ మొక్కల నరికివేత**

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల డివైడర్లపై పెరిగిన కోనోకార్పస్ చెట్లను గురువారం ఆర్అండ్‌బీ అధికారుల ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ చెట్ల వల్ల శ్వాసకోశ మరియు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు, వాకింగ్ వచ్చే ప్రజలు గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావడంతో సర్పంచ్ ఎలగందుల నరసింహులు, అధికారుల సమన్వయంతో ఈ తొలగింపు చర్యలు చేపట్టారు. పాత బస్టాండ్ నుండి వివిధ సరిహద్దుల వరకు ఉన్న కోనోకార్పస్ మొక్కలను ట్రీ కట్టర్ల ద్వారా తొలగించినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. తొలగించిన స్థానంలో రహదారుల అందాన్ని పెంచేలా పూల మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పంచాయతీ పాలకవర్గం పేర్కొంది.

# అధిక నత్రజని వాడకంతో వరి పంటకు తెగులు: ఏవో శ్రీకాంత్

- వరి పంటలో నత్రజని వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి సూచన
- కల్వచర్ల, లొంకకేసారంలో పంటల పరిశీలన
- తెగుళ్ల నివారణకు మందుల స్ప్రే ఆదేశం



రామగిరి, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి): వరి పంటలో అధిక దిగుబడి కోసం మోతాదుకు మించి నత్రజని ఎరువులు వాడకూడదని మండల వ్యవసాయ శాఖ అధికారి చిందం శ్రీకాంత్ రైతులకు సూచించారు. గురువారం కల్వచర్ల, లొంకకేసారం గ్రామాల్లోని వరి పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి, బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు లక్షణాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీకాంత్ మాట్లాడుతూ.. నత్రజని పరిమితికి మించి వాడటం వల్లే ఈ తెగులు ఉధృతమవుతుందన్నారు. తెగులు నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల అగ్రిమైసిన్/ప్లాంటోమైసిన్/స్ట్రెప్టోసైక్లిన్‌తో పాటు కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అరవింద్, రైతులు పాల్గొన్నారు.

# ఐడీపీ లైసెన్సుల మంజూరులో జాప్యం: అభ్యర్థుల అవస్థలు

- ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని విదేశీ ప్రయాణికుల ఆవేదన
- రవాణా శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వేగంగా లైసెన్సులు ఇవ్వాలని విజ్ఞప్తి




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి): సిరిసిల్ల రవాణా శాఖ కార్యాలయంలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో విదేశాలకు వెళ్లే యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా దరఖాస్తు చేసుకున్న 3 నుంచి 4 గంటల్లోపు ఇవ్వాల్సిన ఐడీపీ లైసెన్స్ సమయానికి అందకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రానికి దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల నుంచి వచ్చే అభ్యర్థులు కార్యాలయంలో ఫోటో దిగిన తర్వాత కూడా లైసెన్స్ కోసం సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. సమయం వృథా కావడంతో పాటు రవాణా పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఐడీపీ లైసెన్సులను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్

మంథని, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి): మంథని పట్టణంలో నిర్మిస్తున్న నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, అతిత్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్, ఇంజనీరింగ్ అధికారులు మరియు పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో పట్టణంలో 50 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రోడ్డు విస్తరణతో పాటు రాబోయే గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను సైతం వేగవంతం చేస్తున్నామని చైర్మన్ తెలిపారు. అన్ని ప్రధాన అభివృద్ధి పనులను ఏడాదిలోగా పూర్తి చేసి మంథనిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొనగా, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మరియు నాయకులు పాల్గొన్నారు.



## ట్రూ-అప్ పేరుతో రూ.5,420 కోట్ల భారం



కరీంనగర్, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి): ట్రూ-అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపడం సరికాదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ సభ్యులు తేజదీప్ రెడ్డి కోమటిరెడ్డి అన్నారు. టీజీఈఆర్సీ అనుమతితో మొత్తం రూ.7,635.22 కోట్లలో రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారని తెలిపారు. నవంబర్ నుంచి తొలి నెల యూనిట్‌కు 30 పైసలు, ఆ తర్వాత 50 పైసలు చొప్పున అదనంగా వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఈ నిర్ణయం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు, పరిశ్రమలపై భారం పెంచుతుందని విమర్శించారు. ట్రూ-అప్ చార్జీలను పునఃసమీక్షించి ప్రజలపై అదనపు భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పత్తిపాక పాఠశాలకు రూ.1.40 లక్షల ఆర్వో ప్లాంట్ విరాళం

జమునారాణి చేతుల మీదుగా ఆర్వో ప్లాంట్ ప్రారంభం




ధర్మారం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి): ధర్మారం మండలం పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఉమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ కరీంనగర్ కార్యదర్శి ఏ. జమునారాణి గురువారం రూ.1.40 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 250 ఎల్‌పీహెచ్ శుద్ధి సామర్థ్యం, 500 లీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌ను ఎఫ్‌డీఎన్‌ఎఫ్ ఆర్గనైజేషన్, స్విట్జర్లాండ్ సహకారంతో ఉమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ విరాళంగా అందించింది. ఈ ప్లాంట్ ద్వారా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు చెందిన దాదాపు 300 మంది విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా జమునారాణి మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తగినంత పరిశుభ్రమైన నీరు తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గడంతో పాటు విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడుతాయని తెలిపారు. ఆర్వో ప్లాంట్ ద్వారా నీటిలోని ఫ్లోరైడ్, ఉప్పు శాతం తగ్గి పిల్లలకు సురక్షితమైన తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే పరిశుభ్రమైన నీరు తాగే అలవాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడుతుందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో పరిష్కారం లభించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన దాతలు, సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూతి మల్లన్న, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, అంగన్వాడీ టీచర్ వినోద, చొప్పదండి ఉన్నత పాఠశాల పీడీ కృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఏలేటి పద్మ లచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత, ఏ. శారద, మల్లిక, కె. ప్రసాద్, గోపాల్, శారద, రజిత, విద్యా వాలంటీర్లు అరుణశ్రీ, సౌజన్య, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## 9వ జాతీయ పోషణ మాసంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా కళ్యాణ లక్ష్మి గార్డెన్‌లో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం--2026 జిల్లా స్థాయి పోషణ మేళా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, శిశు సంరక్షణ మరియు సమగ్ర అభివృద్ధిపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన ప్రదర్శనలను పరిశీలించారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి జీవితంలో తొలి 1,000 రోజులు అత్యంత కీలకమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా తగిన పోషకాహారం మరియు వైద్య సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ప్రసంగించిన అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ప్రజాప్రతినిధులు, సీడీపీఓలు, పోషణ్ అభియాన్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముస్కానిపేట ఆలయంలో దొంగతనం చేసిన దొంగల అరెస్ట్



**ఇల్లంతకుంట అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ముస్కంపేట లో గల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఎల్లమ్మ గుడిలలో దొంగతన చేసిన నిందితులను సీసీటీవీ కెమెరాలను పరిశీలించి, దొంగతనం చేసిన వ్యక్తులను ఇల్లంతకుంట మండలంలోని ఎర్రనార్సుపల్లి గ్రామానికి చెందిన రాగుల అనిల్ పల్లె వేణుగా గుర్తించ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ ఐ ఉపేంద్ర చారి తెలిపారు

## గోల్డ్ ప్రశంస పత్రాన్ని అందుకున్న సర్పంచ్

**గంగాధర 08/అక్టోబర్/ 2026: (ప్రజా జ్యోతి):** గంగాధర మండలం నారాయణపూర్ గ్రామం టిబి ముక్త్ గ్రామ పంచాయతీగా ఎంపికయ్యింది. గురువారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో గోల్డ్ ప్రశంస పత్రాన్ని డిపివో, డీఎంఎచ్ఓ చేతుల మీదుగా సర్పంచ్ దీకొండ బాబ లక్ష్మి -మధు అందుకున్నారు. దీనికి సహకరించిన డా, సుజాత కు, పాలకవర్గ సభ్యులకు, ఏఎన్ఎం, ఆశ వర్కర్, కార్యదర్శికి, గ్రామ పంచాయతీ సిబ్బందికి, గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలను సర్పంచ్ తెలిపారు.



# సీసీ కెమెరాల బలోపేతానికి సివిల్ కాంట్రాక్టర్ల అండ

### రామగిరి పోలీసులకు రూ.80 వేల విరాళం అందజేత

**రామగిరి, అక్టోబర్ 08 (ప్రజాజ్యోతి) :** ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు తమ వంతు సహకారం అందించేందుకు ఎస్-సీసీఎల్ ఆర్జీ-3 ఏరియా సివిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ముందుకొచ్చింది. రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అసోసియేషన్ తరఫున రూ.80 వేల విరాళాన్ని అందజేశారు. గురువారం అసోసియేషన్ ప్రతినిధులు ఈ మొత్తాన్ని ఎస్ఐ తాడవేని శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ నిధులతో పనిచేయని పాత సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రజల భద్రత కోసం సివిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అందించిన సహకారం అభినందనీయమని ఎస్సై తాడవేని శ్రీనివాస్ పేర్కొన్నారు.




# హక్కులు తెలుసుకుంటేనే రక్షణకు బలం

### మంథని ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి

**రామగిరి, అక్టోబర్ 08 (ప్రజాజ్యోతి) :** బాలికలు తమ హక్కులను తెలుసుకుని, వాటికి రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మంథని ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంథని న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో రామగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాలు, ఉచిత న్యాయ సహాయం, వేధింపులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమస్య ఎదురైనప్పుడు భయంతో మౌనం వహించకుండా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను ఆశ్రయించాలని జడ్జి సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ప్రతి బాలికకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి పి. మంజుల, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, ఎస్ఐ తాడవేని శ్రీనివాస్, న్యాయవాదులు శశిభూషణ్ కాచే, మంథని శ్రీనివాస్, ఎండీ షబానా, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రెడ్‌క్రాస్ ఎన్నికల్లో గెలిచిన ఆర్యవైశ్యులకు ఘన సన్మానం

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి)** కరీంనగర్లోని ఈ నెల 4న జరిగిన రెడ్‌క్రాస్ ఎన్నికల్లో విజయం సాధించిన ఆర్యవైశ్య ప్రముఖులు చిధుర సురేష్, పెద్ది విద్యాసాగర్, ఎలుగందుల మునిందర్, రాగి శ్రీనివాస్‌లను కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎన్నికల్లో విజయం సాధించిన వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజ సేవలో మరింతగా ముందుకు సాగుతూ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రధాన కార్యదర్శి కొమరవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు జీడిగే సాయి కృష్ణ, వివిధ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కించపరిచే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారి పై చర్యలు తీసుకోవాలి

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి )** మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కించపరిచేలా కిషన్‌నగర్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట కొద్దిసేపు బైఠాయించి నిరసన తెలిపారు. బీఆర్ఎస్‌లో యువత చేరడాన్ని జీర్ణించుకోలేక కొందరు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అడ్డుకుని బాధ్యులపై కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ కార్పొరేటర్లు గందె మహేష్, ఐలేందర్ యాదవ్, ఎడ్ల అశోక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# 27-28 లక్ష్యాలపై సింగరేణి కార్పొరేట్ టార్గెట్ కమిటీ సమీక్ష

**- ఉత్పత్తి, రవాణా, ఓబీ పనులపై ప్రణాళికలు**



**రామగిరి, అక్టోబర్ 08 (ప్రజాజ్యోతి) :**
సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో కార్పొరేట్ టార్గెట్ కమిటీ గురువారం పర్యటించి 2027-28 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించాల్సిన లక్ష్యాలు, ప్రణాళికలపై సమీక్ష నిర్వహించింది. కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జీఎం, కమిటీ కన్వీనర్ జి. దేవేందర్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్, అడ్రియాల జీఎం కొలిపాక నాగేశ్వరరావుతో పాటు వివిధ గనులు, విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ తొలగింపు తదితర అంశాలపై లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికలను చర్చించారు. భూగర్భ, ఉపరితల గనులకు అవసరమైన యంత్రాలు, పరికరాలు, పనిముట్లు, మౌలిక సదుపాయాలపై కూడా సమీక్షించి సూచనలు చేశారు. భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని కమిటీ సూచించింది. కార్యక్రమంలో జీఎంలు పి.ఎలీషా, కె. యాదయ్య, ఎం.వి. నరసింహరావు, జె. వెంకటరమణ, ఏజీఎం సిహెచ్. వెంకయ్య, ఎస్వోటుజీఎంలు ఎం. రామ్మోహన్, బండి సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్లు ఎ. ఉదయభాస్కర్, దూప్‌సింగ్, ప్రాజెక్ట్ అధికారులు జె. రాజశేఖర్, కె. జనార్దన్, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జ్ఞాన సంబంధన్, ప్రకాష్, మేనేజర్లు రావుల పాపయ్య, భరత్‌కుమార్, కమిటీ సభ్యులు సిహెచ్. గాబ్రియల్ రాజు, రామకృష్ణ, గంగాధర్, వివిధ గనులు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# వివేకానంద డిగ్రీ కళాశాలలో 'ఫ్రెషర్స్ డే' వేడుకలు








**కరీంనగర్ టౌన్,అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి)**
రేకుర్తి రాజశ్రీ ఫంక్షన్‌హాల్‌లో వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో వివేకానంద డిగ్రీ కళాశాల 'ఫ్రెషర్స్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థులను సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇదే కళాశాలలో చదివిన మేయర్ శ్రీనివాస్ తన గురువులను శాలువాలతో సత్కరించి, విద్యార్థి దశలోని అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యసాధనకు కృషి చేయాలని, విద్యతో పాటు సామాజిక సేవలోనూ ముందుండాలని సూచించారు. తన విద్యార్థి దశలో కళాశాల తరఫున 690 మందికి రక్తదానం చేయించడంతో పాటు జాతీయ సమైక్యత, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విషయాలను గుర్తుచేశారు. స్వామి వివేకానంద, భగత్‌సింగ్, అబ్దుల్ కలాం, ప్రధాని నరేంద్ర మోదీ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్.వి. శ్రీరంగ ప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ వి. ఆగం రావు, త్రీటౌన్ సీఐ తిరుమల్ గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన మండల అధ్యక్షుడు చెల్కల జితేందర్ యాదవ్ కు కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం..

**ముత్తారం,అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి)**
మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చెల్కల జితేందర్ యాదవ్ కు జిల్లా యాదవ సంఘం నాయకులు ఘనంగా సన్మానం చేశారు. గురువారం రామగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధవేణి రాజేందర్ యాదవ్ లు ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు




మాట్లాడుతూ యువ నాయకుడు జితేందర్ యాదవ్ నాయకత్వంలో ముత్తారం మండలంలో యాదవ సంఘం మరింత బలోపేతం కావాలని, ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఉడుత పర్వతాలు యాదవ్, మంథని మండల అధ్యక్షులు పర్ష మోహన్ యాదవ్,గిరవేన రాములు యాదవ్, ఫకీరా యాదవ్,తిరుపతి యాదవ్,యుగేందర్ యాదవ్, కొడారి మల్లేశం యాదవ్ తదితర యాదవ సంఘం నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జితేందర్ యాదవ్ ను అభినందించారు.



## ధర్మారం మండలంలో 10 గ్రామాలు 'జీరో టీబీ' గ్రామాలుగా గుర్తింపు

**ధర్మారం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని 10 గ్రామాలు క్షయవ్యాధి రహిత 'జీరో టీబీ' గ్రామాలుగా ఎంపికై అరుదైన గుర్తింపు సాధించాయి. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీరాములు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. గడిచిన మూడేళ్లుగా ఒక్క కేసు నమోదు కాని తండా-కే గ్రామానికి గోల్డ్, మూడేళ్లలో కేసులు లేని శాయంపేటకు సిల్వర్, ఏడాదిగా కేసులు లేని మరో 8 గ్రామాలకు బ్రాంజ్ సర్టిఫికెట్లు లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపీడీవో సుమలత, వైద్యాధికారి సుష్మిత ఆధ్వర్యంలో వైద్య, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో కఫం, ఎక్స్‌రే పరీక్షలు విస్తృతంగా నిర్వహించి వ్యాధి నిర్మూలనకు కృషి చేయడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు.

## ధర్మారం సర్పంచ్, ఉప సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు

**ధర్మారం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):**
ధర్మారం గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సర్పంచ్ ద్యాగేటి రాజేశ్వరి, ఉప సర్పంచ్ ఎలిగేటి మల్లేశంలకు జిల్లా కలెక్టర్ గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామానికి చెందిన మేడవేని తిరుపతి ఫిర్యాదు మేరకు పంచాయతీ రికార్డులు, ఇంటి నిర్మాణ అనుమతులు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై డీపీఓ నిర్వహించిన విచారణ నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం--2018 నిబంధనలను ఉల్లంఘించి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలడంతో, సెక్షన్ 37(5) ప్రకారం చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందిన 15 రోజుల్లోగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంజాయిషీ సమర్పించకపోతే రికార్డుల ఆధారంగా చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.



ద్యాగేటి.రాజేశ్వరి (సర్పంచ్)



ఎలిగేటి మల్లేశం (ఉప సర్పంచ్)



## కాలువ సర్వేను అడ్డుకున్న రైతులు

**భూములు కోల్పోతామని ఆందోళన.. తహసీల్దార్‌కు వినతి**

కొడిమ్యాల,అక్టోబర్ 08,(ప్రజాజ్యోతి): డి-1 కాల్వ నిర్మాణం కోసం చేపట్టిన సర్వేను రైతులు అడ్డుకున్నారు. కొడిమ్యాల మండలంలోని కొడిమ్యాల, చెప్యాల, అప్పారావుపేట, రామకిష్టాపురం, కొండాపురం గ్రామాల మీదుగా కాల్వ నిర్మాణానికి గతంలో అలైన్‌మెంట్ రూపొందించారు. మైసమ్మ చెరువు నుంచి గోపాల్రావుపేట చెరువుకు 33 అడుగుల వెడల్పుతో కాల్వ నిర్మాణం ప్రతిపాదించినట్లు రైతులు తెలిపారు. 17 ఏళ్ల క్రితమే కాల్వ నిర్మాణంపై అభ్యంతరాలు వ్యక్తం చేసి హైకోర్టును ఆశ్రయించామని, రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని అప్పట్లో కోర్టు ఆదేశించిందని వారు పేర్కొన్నారు. ఇటీవల అధికారులు మళ్లీ భూసేకరణకు చర్యలు చేపట్టడంతో తమ అభ్యంతరాలను తెలియజేసి, గతంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రతులను అందజేశారు. అయినప్పటికీ ఈ నెల 7న అధికారులు సర్వేకు రావడంతో రైతులు అడ్డుకున్నారు. కాల్వ నిర్మాణంతో తమ విలువైన వ్యవసాయ భూములు కోల్పోయి జీవనాధారం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్వేను నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్ నరేష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని

**కొడిమ్యాల, అక్టోబర్ 08 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థిని తూడి లాస్య రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్--19 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. అక్టోబర్ 9న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో లాస్య పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లాస్యను ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్--19 కార్యదర్శి బన్సీలాల్, పీడీ అనూప్‌రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నర్సయ్య, సీనియర్ కోచ్‌లు ఎంద్రికాయల శ్రీనివాస్, రాజు, మల్లేశం, అనిల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



# పీఏసీఎస్‌లు రైతులకు వారధిగా పనిచేయాలి

**రైతుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి: ఆది శ్రీనివాస్**



**మేడిపల్లి, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా పీఏసీఎస్ నూతన పాలకవర్గాలు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. గురువారం మేడిపల్లి మండలంలోని పోరుమళ్ల, వల్లంపల్లి, మేడిపల్లి, భీమారం పీఏసీఎస్‌ల నూతన అధ్యక్షులు, పాలకవర్గ సభ్యుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, రైతులకు మధ్య పీఏసీఎస్‌లు వారధిగా పనిచేయాలని అన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడడంతోపాటు విద్యుత్, సాగునీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాల ద్వారా అండగా నిలవాలని సూచించారు. రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేశామని, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వాణిజ్య పంటల సాగుతోపాటు పశుపోషణపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఎస్సారెస్పీ పరిధిలో సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వరద కాలువ, మిడ్‌మానేరు, ఎస్సారెస్పీ వంటి సాగునీటి వనరులతో ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం కలుగుతోందన్నారు. అవసరమైన చోట రహదారులు, వంతెనలు, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతుల సమస్యలను పీఏసీఎస్ పాలకవర్గాలు తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తాను అండగా ఉంటానని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ అడ్వైజర్ కమిటీ సభ్యుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్, పీఏసీఎస్ అధ్యక్షులు ఎద్మల రాజేందర్‌రెడ్డి, ఏనుగు రమేష్‌రెడ్డి, ఉరుమడ్ల లక్ష్మణ్, చిట్యాల శ్రీనివాస్, పలువురు డైరెక్టర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా గోరుమంతుల ప్రవీణ్ కుమార్





**మెట్‌పల్లి, అక్టోబర్ 8, ప్రజా జ్యోతి:** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా (డిస్ట్రిక్ట్ స్పోక్స్‌పర్సన్) వెంపేట్ గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర పీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావుల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రవీణ్ కుమార్‌కు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం సాగిన ఉద్యమంలో ప్రవీణ్ కుమార్ కీలకంగా పాల్గొని, పలుమార్లు అరెస్టై జైలు జీవితం సైతం గడిపినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా నిబద్ధతతో పనిచేస్తున్న ఆయనకు ఈ పదవి సముచిత గుర్తింపుగా వారు పేర్కొన్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా పార్టీ వాణిని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన నియామకంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

# నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాల పంపిణీ

**రాయికల్, అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి)** రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి కరపత్రాలను పంపిణీ చేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, నైవేద్యాలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో నవదుర్గ సేవా సమితి సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు



# భక్తులకు ఇబ్బందులు లేకుండా పుష్కర ఏర్పాట్లు చేయాలి

- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్
- బీర్ పూర్ మండలంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన
- రూ.9.36 లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- రైతుల కోసం రోల్లవాగు ప్రాజెక్ట్ షెట్టర్లు ఓపెన్



**బీర్ పూర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** గోదావరి పుష్కరాల నేపథ్యంలో బీర్ పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ గురువారం విస్తృతంగా పర్యటించారు. మండలంలోని రంగసాగర్, మంగేలా, కమ్మనూరు, చిత్రవేణిగూడెం, రేకులపల్లి గ్రామాల్లోని గోదావరి నది పుష్కర ఘాట్లను సందర్శించి, అక్కడ చేపట్టనున్న పనులను మరియు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఘాట్ల వద్ద వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీరు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు మరియు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మంగెల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.

**రూ.9.36 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ:**

అనంతరం బీర్ పూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.9 లక్షల 36 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తుందని భరోసా ఇచ్చారు.

**రోల్లవాగు షెట్టర్లు ఓపెన్.. ప్రతిపక్షాలపై విమర్శలు:**

బీర్ పూర్ మండల రైతుల వినతి మేరకు పంటలకు సాగు నీటి సరఫరా కోసం రోల్లవాగు ప్రాజెక్ట్ షెట్టర్లను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఓపెన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోల్లవాగు ప్రాజెక్ట్ పూర్తి కి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దీని కోసం రూ.30 కోట్ల నిధులు కాంట్రాక్టర్‌కు మంజూరు చేయడం జరిగిందన్నారు. ముంపుకు గురవుతున్న 827 ఎకరాల అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా 827 ఎకరాల రెవెన్యూ భూమిని అటవీ శాఖకు అప్పగించామని, తాము ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుండటం వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో అటవీ అనుమతుల ప్రక్రియ త్వరితగతిన జరుగుతోందని, ఈ అనుమతులు వస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి దాదాపు రూ.7 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంటుందని, గతంలో అటవీ సర్వే కోసం రూ.35 లక్షలు చెల్లించామని వివరించారు. రోల్లవాగు విషయంలో మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ మంత్రి చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉండి వారు ఈ ప్రాజెక్ట్ కోసం ఏం చేశారో రైతులకు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ఎంపీ గెలిచి 7 ఏళ్లవుతున్నా బీర్ పూర్ మండలంలో ఒక్క దళిత వాడకు కూడా వెళ్లలేదని, దేశం-ధర్మం అనడం మినహా అభివృద్ధికి ఆయన పైసా సహకారం అందించలేదని విమర్శించారు. బీర్ పూర్ ఘాట్ రోడ్డుకు డబల్ రోడ్డు మంజూరైందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, ఎంపీడీఓ భీమేష్, ఎమ్మార్వో సుజాత, ఇరిగేషన్ డీఈ రవి కుమార్, స్పెషల్ ఆఫీసర్ రామచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారపాక రమేష్, ప్యాక్స్ చైర్మన్ పొలసాని నవీన్ రావు, శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ ఆలయ చైర్మన్ చేర్నేని శ్రీనివాస్, సర్పంచులు అర్షకోట రాజగోపాల్ రావు, ఎడ్ల సృజన సుశిన్, ఎలమట్ల హరీశ్, పూదూరు శ్రీలత రాజ్ కుమార్, బోడ సాగర్, బనుక సతీష్, పుర్కా దీప కల్పన, చల్ల లక్ష్మణ్, రంగు లక్ష్మణ్, తోట శ్రీనివాస్, చిక్రశీ మారుతి, కోనపెల్లి శేఖర్, మసీద్ తిరుపతి, తోడశం ఇస్రు, కొమిరె నర్సయ్య, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోండుగూడెం ఆశ్రమ పాఠశాలలో వైభవంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

**బీర్ పూర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** బీర్ పూర్ మండల పరిధిలోని గోండుగూడెం ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగను పురస్కరించుకొని విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ చేరి, చప్పట్లు కొడుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలతో అలరించారు. అనంతరం నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టతను, ప్రకృతితో ముడిపడి ఉన్న దాని ప్రాధాన్యతను వివరించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ శేఖర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు నిదర్శనమని అన్నారు. విద్యార్థుల్లో చదువుతో పాటు మన సంస్కృతిపై అవగాహన, సామూహిక స్ఫూర్తిని పెంపొందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ పురుక దీపకల్పన-రాంచందర్ మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో ఇంత సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భావితరాలకు మన సంస్కృతిని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వేడుకల అనంతరం విద్యార్థినులు, గ్రామస్తులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీతారాం, గ్రామ ఆదివాసీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు బిజిలి రవీందర్, సమ్మక్క, భీమసేన, శిరీష, కవిత, లావణ్య, గ్రామ ప్రజలు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.





## జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో వైభవంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**జగిత్యాల, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమీంద్ల వాణి ముఖ్య అతిథిగా, కళాశాల సి.పి.డి.సి. సెక్రటరీ డా. జి. శ్రీలత విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. రామకృష్ణ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన సంస్కృతికి మరియు ఐక్యతకు ప్రతీక అని కొనియాడారు. విద్యార్థినులు చదువుతో పాటు సాంప్రదాయాలను గౌరవించడం మంచి పరిణామమన్నారు. అనంతరం విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల బతుకమ్మలతో లయబద్ధంగా పాటలు పాడుతూ, చప్పట్లతో కళాశాల ప్రాంగణంలో కోలాహలం సృష్టించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు విమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డా. యన్. వాసవి, స్టాఫ్ సెక్రటరీ డా. యన్. సంగీత రాణిలను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ వేడుకల్లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. ప్రమోద్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రయ్య మరియు అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**బీర్ పూర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం తాళ్ల ధర్మారం గ్రామంలో ఇటీవల తీవ్ర విషాదంలో ఉన్న మరియు అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి ఇళ్లను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సందర్శించి పరామర్శించారు. గ్రామానికి చెందిన గంగాధరి సుమన్ కుమార్తె ఇటీవల మరణించగా, అలాగే బర్ల చిన్న రాజేశం కుమారుడు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ బాధిత కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి వారిని ఓదార్చారు. కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం, గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బందెల గంగయ్య, బందెల చంద్రయ్యల నివాసాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందేలా చూస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీర్ పూర్ మండల మరియు గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.






## తాళ్లధర్మారం జీపీకి 'టీబీ ముక్త భారత్' సిల్వర్ మెడల్ అవార్డు

**బీర్ పూర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** తాళ్లధర్మారం గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయి 'టీబీ ముక్త భారత్' సిల్వర్ మెడల్ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్షయ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా, గ్రామంలో టీబీ నిర్మూలనకు చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ఈ ప్రతిష్టాత్మక వెండి పతకాన్ని ప్రకటించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, తాళ్లధర్మారం గ్రామ ప్రతినిధులకు ఈ అవార్డును అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అవార్డుతో పాటు సన్మానం అందుకున్న వారిలో తాళ్లధర్మారం గ్రామ పంచాయతీ సర్పంచ్ వినోద-లక్ష్మణ్, జీపీ సెక్రెటరీ లివిన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధారెడ్డి, మరియు సూపర్‌వైజర్ కిషోర్ పవార్ ఉన్నారు. తాళ్లధర్మారం గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలిపినందుకు ప్రజాప్రతినిధులను, వైద్య మరియు పంచాయతీ సిబ్బందిని అడిషనల్ కలెక్టర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. గ్రామాన్ని వంద శాతం టీబీ రహితంగా మార్చేందుకు ఇలాగే కట్టుబడి పనిచేస్తామని గ్రామ బృందం పేర్కొనగా, ఈ అవార్డు రావడం పట్ల స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాజారాంపల్లి లో బతుకమ్మ గాటు పరిశీలన, సిద్ధం

**ఎండపల్లి, అక్టోబరు 8,ప్రజా జ్యోతి**



మండలంలోని రాజారాంపల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలోని అంగడి సమీపంలో ఉన్న వాగును జేసీబీతో చదును చేసి, మట్టితో కట్ట నిర్మించి నీటిని నిల్వ చేశారు.గ్రామ సర్పంచ్ సంగ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. బతుకమ్మ గాటు సిద్ధం చేశారు,ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేరుగు జంపన్న (జానీ), వార్డు సభ్యుడు దర్శనాల సతీష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏలేటి చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లేశం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరు పంట పొలాల్లో పొలాస శాస్త్రవేత్తల క్షేత్ర పరిశీలన...

### వరి, మిర్చి, కూరగాయలు, మామిడి తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు...



**రాయికల్, అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి)** రాయికల్ మండలంలోని ఆలూరు గ్రామంలో పొలాస పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ పంటలను పరిశీలించారు. పొలాస పరిశోధనా స్థానం దత్తత గ్రామమైన ఆలూరులోని పంట పొలాలు, కూరగాయల సాగు, మామిడి తోటలను పరిశీలించి రైతులకు పంటలలో వచ్చే తెగుళ్లు, పురుగు సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి పంటలో అగ్గి తెగులు లక్షణాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, తెగులు నివారణకు టెబుకోనాజోల్ ం ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 80 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా మిర్చి పంటలో కొమ్మువిరుపు తెగులు నివారణకు అజాక్సిస్ట్రోబిన్ ం డైఫెనకోనాజోల్ 200 మి.లీ. ఎకరానికి, త్రిప్స్ నివారణకు సైయంట్రానిలిప్రోల్ 300 మి.లీ. ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. మందులను వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులోనే వినియోగించాలని, అవసరానికి మించి రసాయనాలను ఉపయోగించవద్దని రైతులకు సూచించారు. ప్రస్తుతం నెలకొన్న ఎండ, మంచు తదితర వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల్లో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని కీటక శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి రైతులకు వివరించారు. మామిడి తోటలను పరిశీలించిన ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి, మామిడిలో తేనెమంచు (హనీడ్యూ) సంబంధిత సమస్యలు, వాటికి కారణమయ్యే కీటకాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పంటను తరచూ పరిశీలిస్తూ సమస్యలు ప్రారంభ దశలోనే గుర్తించి తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. ఈ క్షేత్ర పరిశీలన కార్యక్రమంలో సర్పంచ్ నల్లాల స్వామి, పీఏసీఎస్ చైర్మన్ దేటి రాజారెడ్డి, రైతులు మెక్కొండ రాంరెడ్డి, ఎలిపెద్ది రాజు, నల్లాల తిరుపతి, సతీష్, మల్లారెడ్డి, పెద్ద సాయన్న, గంగవ్వ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# తొలిసారిగా కన్నులపండువగా బతుకమ్మ వేడుకలు

### హుస్సేన్‌నగర్ బడిలో ఘనంగా సంబరాలు



**మల్లాపూర్, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి,** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు హుస్సేన్‌నగర్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చరిత్రలో తొలిసారిగా నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా పేర్చారు. అనంతరం సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడి, చప్పట్లు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలతో సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచడంతో పాటు పండుగల విశిష్టతను తెలియజేసేందుకు తొలిసారిగా బతుకమ్మ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఉపాధ్యాయులు ప్రవీణ, కీర్తనలతో పాటు విద్యార్థుల తల్లుల సామూహిక భాగస్వామ్యంతో వేడుకలు విజయవంతమయ్యాయి. విద్యార్థినుల బతుకమ్మ ఆటలు, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**వేములవాడ, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** వేములవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్ ఆధ్వర్యంలో పాక్స్ చైర్మన్లు వకుళాభరణం శ్రీనివాస్, జి. ప్రభాకర్‌లు ప్రభుత్వ విప్‌ను శాలువా, పూలబుకేతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వేములవాడలో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు భవిష్యత్తులో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ఇక్కడే నిర్వహించాలని ప్రభుత్వ విప్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు, వేములవాడలో మరిన్ని పెద్ద స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ క్రీడాకారుడు సోయినేని బాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.